జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

హైదరాబాద్ | సంపుటి:01 | సంచిక: 23 | 31-1-2026 | వెల: రూ.5/- | పేజీలు: 06






2లో

## తెలంగాణ నీళ్లపై ఢిల్లీ ద్రోహం

- చంద్రబాబు స్క్రిప్ట్, రేవంత్ అమలు: హరీశ్ రావు
- సీడబ్ల్యూసీ మీటింగ్ పేరుతో ఏపీకి నీటి బదిలీ కుట్ర
- నల్లమల సాగర్ పేరిట 200 టీఎంసీల లూటీ ప్రయత్నం
- తెలంగాణ శత్రువునే అధికారిక ప్రతినిధిగా పంపిన కాంగ్రెస్
- డీపీఆర్‌లపై కేంద్రంరాష్ట్రం గుట్టు మౌనం
- జలహక్కుల కోసం బీఆర్ఎస్ వీధి పోరాట హెచ్చరిక

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్కసారలమ్మ జాతర ఈసారి అపూర్వ వైభవంతో సాగుతోంది. వనదేవతలను దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలివస్తుండటంతో మేడారం పరిసరాలు జనసంద్రాన్ని తలపిస్తున్నాయి. అడవుల మధ్య వెలసిన ఈ పవిత్ర క్షేత్రం భక్తుల జైకారాలతో, నినాదాలతో మార్మోగుతోంది. రెండేళ్లకోసారి మాత్రమే జరిగే ఈ మహాజాతరలో వనదేవతలను దర్శించుకోవడం కోసం దేశం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు.



# మేడారానికి పోటెత్తిన జనం



- వనదేవతల దర్శనానికి లక్షలాది భక్తులు
- గవర్నర్, మంత్రులు, ప్రముఖుల ప్రత్యేక పూజలు
- నిలువెత్తు బంగారం, జంపన్నవాగులో పుణ్యస్నానాలు
- పటిష్ట భద్రత, వేగవంతమైన దర్శన ఏర్పాట్లు
- తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్ ఇబ్బందులు

కాకతీయులపై పోరాడిన వీరనారీమణులు సమ్మక్కసారలమ్మలు రెండేళ్ల విరామం తర్వాత వనం వీడి భక్తజనుల మధ్యకు రావడంతో మేడారం ఆధ్యాత్మిక శోభతో ఉట్టిపడింది. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువుదీరడంతో భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. గద్దెలపై వనదేవతల దర్శనం లభించడంతో భక్తులు భావోద్వేగానికి లోనవుతూ కన్నీళ్లతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. "జై సమ్మక్క జై సారలమ్మ" అంటూ మార్మోగిన నినాదాలు



2లో

## ఇది ఎక్సలెంట్ న్యూస్: సీఎం చంద్రబాబు

- 'ఐగాట్ కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో ఏపీ సరికొత్త రికార్డు
- కోటికి పైగా ఎన్‌రోల్‌మెంట్లు పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా ఘనత
- ప్రభుత్వ ఉద్యోగుల నిబద్ధతను కొనియాడిన సీఎం చంద్రబాబు
- నైపుణ్యం గల పరిపాలన కోసమే ఈ కార్యక్రమమని వెల్లడి
- ఈ ఘనతలో ఏపీఎస్‌డీపీఎస్ పాత్రను అభినందించిన సీఎం

ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే 'ఐగాట్ కర్మయోగి' పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్ సరికొత్త రికార్డు సృష్టించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇది అద్భుతమైన వార్త అని, ప్రభుత్వ ఉద్యోగులు నిరంతర అభ్యాసంపై చూపుతున్న నిబద్ధతకు ఈ ఘనత నిదర్శనమని ఆయన అన్నారు. నైపుణ్యం,

- మిగతా 2వ పేజీలో

### హార్వర్డ్ కెనడీ స్కూల్ నుంచి

## సీఎం రేవంత్ రెడ్డికి సర్టిఫికెట్

- లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' కోర్సు పూర్తి
- ఈ నెల 2530 వరకు జరిగిన ప్రత్యేక శిక్షణ తరగతులు
- 20 దేశాల నుంచి వచ్చిన 60 మంది పాల్గొన్న కార్యక్రమం
- ప్రతికూల వాతావరణంలోనూ కోర్సు పూర్తి చేసిన సీఎం
- సర్టిఫికెట్ విషయాన్ని ఎక్స్‌లో వెల్లడించిన రేవంత్ రెడ్డి



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనడీ స్కూల్ నుంచి ప్రతిష్టాత్మక సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించిన 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' అనే ప్రత్యేక కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం ఆయనకు ఈ సర్టిఫికెట్‌ను అందజేశారు. ప్రపంచవ్యాప్తంగా నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు రూపొందించిన ఈ కోర్సుకు హాజరుకావడం రాష్ట్రానికి గర్వకారణమని

2లో




2లో

ఫిబ్రవరి 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు...

## 14న బడ్జెట్!

- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం
- ఫిబ్రవరి 14న వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల
- అదే రోజున వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించనున్న మంత్రి అచ్చెన్నాయుడు
- దాదాపు నాలుగు వారాల పాటు కొనసాగనున్న సమావేశాలు

## నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ సిఫార్సులు రావు

- పనిలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్న పవన్
- గత ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖను పూర్తిగా నాశనం చేసిందని విమర్శలు
- వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపణ
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని స్పష్టీకరణ

2లో





## భారత్‌ఈయూ డీల్‌తో పాకిస్థాన్‌కు వణుకు

- యూరోపియన్ మార్కెట్ కోల్పోయే భయంతో పాక్ వ్యాపారులు
- వస్త్ర ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు
- 'GSPG' హోదాపై పాక్‌లో ఆందోళనలు
- భారత్‌ను ఆర్థిక యుద్ధం ప్రారంభించిందని విమర్శలు
- ఈయూతో సంప్రదింపులు జరుపుతున్న పాక్ ప్రభుత్వం

ఆర్థిక సంక్షోభంతో ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉన్న పాకిస్థాన్‌కు భారత్ కుదుర్చుకున్న తాజా అంతర్జాతీయ ఒప్పందం కొత్త భయాలను కలిగిస్తోంది. యూరోపియన్ యూనియన్‌తో భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఫీటా) దాయాది దేశ ఆర్థిక ప్రయోజనాలకు గట్టి దెబ్బగా మారుతుందని పాక్ పారిశ్రామిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా తమ ఎగుమతులకు కీలకమైన యూరోపియన్ మార్కెట్‌ను

- మిగతా 2వ పేజీలో

# భారత్-ఈయూ డీల్‌తో పాకిస్థాన్‌కు వణుకు

భారత్ ఆక్రమించుకునే అవకాశాలు పెరగడంతో పాకిస్థాన్ వ్యాపార వర్గాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రస్తుతం పాకిస్థాన్ మొత్తం ఎగుమతుల్లో దాదాపు 25 శాతం యూరోపియన్ యూనియన్‌కే వెళ్తున్నాయి. ముఖ్యంగా వస్త్ర పరిశ్రమ ఈయూ మార్కెట్‌పై భారీగా ఆధారపడి ఉంది. పాకిస్థాన్‌కు ప్రస్తుతంహోదా ఉండటంతో యూరోప్‌కు పన్నులు లేకుండా లేదా తక్కువ సుంకాలతో ఎగుమతులు చేయగలుగుతోంది. కానీ భారత్‌ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే, ఇదే తరహా ప్రయోజనాలు భారత్‌కూ లభించనున్నాయి. దీంతో ఇప్పటివరకు పన్నులు చెల్లిస్తూ కూడా గట్టి పోటీ ఇచ్చిన భారత్, ఇకపై సుంకాలు లేకుండా ఎగుమతులు చేస్తే తమ ఉత్పత్తులకు డిమాండ్ తగ్గిపోతుందని పాక్ వ్యాపారులు భయపడుతున్నారు. భారత వస్త్ర పరిశ్రమ తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేయగల సామర్థ్యం కలిగి ఉండటమే పాకిస్థాన్‌కు ప్రధాన ఆందోళనగా మారింది. భారత్‌కు 12 శాతం సుంకం ఉన్నప్పటికీ గతంలోనే యూరోపియన్ మార్కెట్‌లో తన ఉనికిని బలపరిచింది. ఇక ఇప్పుడు సుంకాలు తొలగితే, పాక్ వస్త్ర ఎగుమతులు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని పాక్ అధికారులు అంగీకరిస్తున్నారు. మరోవైపు '+జీఎస్పీ+' హోదాను కొనసాగించాలంటే పాకిస్థాన్ మానవ హక్కులు, కార్మిక చట్టాలు, ప్రజాస్వామ్య ప్రమాణాలకు సంబంధించిన కఠిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. కానీ భారత్‌తో ఈయూ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో అటువంటి కఠిన షరతులు తక్కువగా ఉండటమే పాక్‌కు మరింత ఆందోళన కలిగిస్తోంది. 2014లో +జీఎస్పీ+ హోదా లభించిన తర్వాత పాకిస్థాన్ యూరోప్‌కు వస్త్ర ఎగుమతులు 108 శాతం పెరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ మార్కెట్ ప్రమాదంలో పడుతుందన్న భయం నెలకొంది.

# హార్వర్డ్ కెనడీ స్కూల్ నుంచి సీఎం రేవంత్ రెడ్డికి సర్టిఫికెట్

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ, విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హార్వర్డ్ కెనడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన రాజకీయ నాయకులు, విధాన నిర్ణేతలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ కోర్సులో భాగంగా ప్రజాపాలన, విధాన రూపకల్పన, సంక్షోభాల నిర్వహణ, ప్రజాస్వామ్య వ్యవస్థలో నాయకత్వ పాత్ర, గ్లోబల్ సవాళ్లపై స్పందన వంటి కీలక అంశాలపై తరగతులకు హాజరయ్యారు. ఆధునిక ప్రపంచంలో నాయకత్వానికి అవసరమైన దూరదృష్టి, నిర్ణయ సామర్థ్యం, ప్రజలతో అనుసంధానం వంటి అంశాలపై నిపుణులచే శిక్షణ పొందినట్లు సమాచారం. కెనడీ స్కూల్ సర్టిఫికెట్ స్వీకరణ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా పంచుకున్నారు. ఈ కోర్సుకు ప్రపంచంలోని 20 దేశాల నుంచి వచ్చిన సుమారు 60 మంది విద్యార్థులతో కలిసి తరగతులకు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. విభిన్న దేశాల అనుభవాలు, పాలనా విధానాలు తెలుసుకునే అవకాశం లభించడం ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న మార్పులు, ప్రజాపాలనలో వస్తున్న కొత్త ఆలోచనలు తనకు లోతైన అవగాహన కలిగించాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం అమెరికాలో తీవ్రమైన మంచు తుఫానుతో కూడిన వాతావరణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ఆ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ఈ ప్రతిష్ఠాత్మక కోర్సును పూర్తి చేయడం తనకు ప్రత్యేక సంతృప్తినిచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వాతావరణ కఠినత, ఉష్ణోగ్రతలు భారీగా తగ్గిన పరిస్థితుల్లో కూడా తరగతులకు హాజరై శిక్షణ పూర్తి చేసిన అనుభవం మరచిపోలేనిదిగా అభివర్ణించారు.

# ఇది ఎక్సలెంట్ న్యూస్: సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

చురుకుదనం, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా పరిపాలనను నిర్మించడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఐగాట్ కర్మయోగి ప్లాట్‌ఫామ్‌పై కోటికి పైగా కోర్సు ఎన్‌రోల్‌మెంట్లు, 80 లక్షలకు పైగా కోర్సుల పూర్తితో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఉద్యోగులు మొత్తం 4,290 కోర్సులలో ఈ శిక్షణ పూర్తిచేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఆంధ్రప్రదేశ్ సాధించిన ఈ ఘనతను ప్రశంసించింది. ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పౌర సేవలపై సానుకూల ప్రభావం చూపడంలో రాష్ట్రం ముందుందని కొనియాడింది. ఏపీ సాధించిన ఈ విజయం దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంది. ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని పెంపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతకు ఇది నిలువుటద్దమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ఫిబ్రవరి 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు... 14న బడ్జెట్!

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. 16వ శాసనసభ ఐదో సమావేశాలను ఫిబ్రవరి 11వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అసెంబ్లీ సమావేశాలపై నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అమరావతిలోని వెలగపూడిలో ఉన్న అసెంబ్లీ హాలులో ఉభయ సభలను (శాసనసభ, శాసనమండలి) ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడంతో ఈ సమావేశాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. గవర్నర్ ప్రసంగం అనంతరం, సభలో ఆయనకు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 12న ఈ తీర్మానంపై చర్చ ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చర్చకు సమాధానం ఇస్తారు. ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తారు.

# తెలంగాణ నీళ్లపై ఢిల్లీ ద్రోహం

తెలంగాణ: ఢిల్లీ కేంద్రంగా తెలంగాణకు జరుగుతున్న జలద్రోహానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన కారణమని బీఆర్ఎస్ మాజీ మంత్రి టి. హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించి శుక్రవారం న్యూఢిల్లీలో సీడబ్ల్యూసీ చైర్మన్ అధ్యక్షతన జరుగుతున్న సమావేశాన్ని ఉద్దేశించి తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పాలనలో సమైక్య రాష్ట్రంగా ఉన్నప్పుడు తెలంగాణకు నీటి హక్కుల్లో తీరని అన్యాయం జరిగిందని, ఇప్పుడు అదే కాంగ్రెస్ మరోసారి చారిత్రక జలద్రోహానికి తెరలేపుతోందని మండిపడ్డారు. ఈ రోజు ఢిల్లీలో జరుగుతున్న ఇరిగేషన్ మీటింగ్ తెలంగాణ నీటి హక్కులకు మరణ శాసనం రాయబోతున్నదని తీవ్రంగా హెచ్చరించారు. జలద్రోహం విషయంలో కత్తి చంద్రబాబుదైతే, పొడిచేది రేవంత్ రెడ్డి అని విమర్శించిన హరీశ్ రావు, ఇది యాదృచ్ఛికం కాదని, పథకం ప్రకారమే జరుగుతున్న కుట్ర అని ఆరోపించారు. మొదటి నుంచే నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయంలో రేవంత్ రెడ్డి ఏపీ ప్రభుత్వానికి సహకరిస్తున్నాడని, పేరు మార్చినా ప్రాజెక్టు మారలేదని, ఏపీ జలదోపిడి మాత్రం ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాళోజీ ముందే చెప్పినట్టుగా తెలంగాణ సొంత ప్రాంతాన్ని వాడే తెలంగాణకే ద్రోహం జరుగుతోందని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టులను అడుగడుగునా వ్యతిరేకించిన ఆదిత్యనాథ్ దాస్‌ను ఈ కీలక సమావేశానికి పంపడం అంటే తెలంగాణ ద్రోహాన్ని అధికారికంగా ముద్ర వేయడమేనని హరీశ్ రావు మండిపడ్డారు. తెలంగాణ సోయి ఉన్న ఒక్క ఇంజినీర్ కూడా దొరకలేదా? అని ప్రశ్నించారు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్టు, పోను అంటూనే మీటింగ్‌లకు వెళ్లడం వెనుక అసలు ఉద్దేశం ఏంటని నిలదీశారు. తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పగించడమే మీ చర్చల లక్ష్యమా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ రోజు జరుగుతున్న ఢిల్లీ సమావేశం పూర్తిగా ఏపీ ఒత్తిడితోనే జరుగుతోందని హరీశ్ రావు ఆరోపించారు. పేరుకు జలవివాదాల మీటింగ్ అయినా, అసలు ఎజెండా మాత్రం నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టే అని స్పష్టం చేశారు. మన 200 టీఎంసీల నీటిని ఏపీకి తరలించేందుకు కేంద్రం, ఏపీ, కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి చేస్తున్న కుట్ర ఇది అని వ్యాఖ్యానించారు. గతంలో కేంద్ర జల్ శక్తి శాఖ సమావేశాల్లో కూడా ఏపీ ఇదే ప్రాజెక్టును ముందుకు తెచ్చిందని, ఇప్పుడు కూడా అదే స్క్రిప్టును కొనసాగిస్తున్నారని విమర్శించారు. డిసెంబర్ 30న తాను రాసిన లేఖకు తెల్లారి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించిందని గుర్తు చేసిన హరీశ్ రావు, నల్లమల సాగర్‌కు సంబంధించిన డీపీఆర్‌ను వెంటనే ఆపాలని, కేంద్ర అనుమతుల ప్రక్రియను నిలిపివేయాలని రెండు కండీషన్లు పెట్టామని తెలిపారు. అలాగే ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్టు ఆపినట్టు ఏపీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశామని చెప్పారు. ఈ రెండు అంశాలపై కేంద్రం హామీ ఇచ్చిందా? ఏపీ హామీ ఇచ్చిందా? అని ప్రశ్నించారు. వాటిపై స్పష్టత లేకుండానే ఈ రోజు మీటింగ్‌కు వెళ్లడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని నిలదీశారు. గతంలో 9వ గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశంలో ఆదిత్యనాథ్ దాస్ కాళేశ్వరం, గోదావరి, సీతారామ లిఫ్ట్, తుపాకులగూడెం, మిషన్ భగీరథ, చనాక కొరటా, రామప్ప డైవర్షన్ లాంటి ప్రాజెక్టులన్నింటినీ అక్రమమని చెప్పి నిలిపివేయాలని కోరిన విషయాన్ని హరీశ్ రావు గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిని ఇప్పుడు తెలంగాణ తరఫున ప్రతినిధిగా పంపడం అంటే తెలంగాణను ఏపీకి తాకట్టు పెట్టడమేనని విమర్శించారు. కేసీఆర్ పోరాటంతోనే గోదావరిలో 400 టీఎంసీలకు కేంద్ర అనుమతులు వచ్చాయని, 10 డీపీఆర్‌లు పంపి 7 ప్రాజెక్టులకు అనుమతులు సాధించామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో ఒక్క డీపీఆర్ కూడా పంపలేదని, ఒక్క అనుమతీ తెచ్చుకోలేదని తీవ్ర విమర్శలు చేశారు. వార్ధా, కాళేశ్వరం మూడో టీఎంసీలకు సగం అనుమతులు వచ్చినా, వాటిని పూర్తి చేయకుండా డీపీఆర్‌లను వాపస్ తీసుకున్న చరిత్ర రేవంత్ రెడ్డి పాలనదని ఎద్దేవా చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు మరోసారి సిట్ నోటీసు

తెలంగాణలో రాజకీయంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరోసారి నోటీసులు జారీ చేసింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 160 సెక్షన్ కింద విచారణకు హాజరుకావాలని కోరుతూ సిట్ అధికారులు రెండో విడత నోటీసును అందించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలోనే విచారణ నిర్వహిస్తామని నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు నందినగర్‌లోని ఆయన ఇంటి గేటుకు నోటీసులను అంటించారు. కేసీఆర్ అధికారిక చిరునామా నందినగర్‌గానే ఎన్నికల అఫిడవిట్‌లు, అసెంబ్లీ రికార్డుల్లో నమోదై ఉందని సిట్ స్పష్టం చేసింది. ఇంతకుముందు గురువారం రోజున సిట్ అధికారులు కేసీఆర్‌కు విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు ఇచ్చారు. అయితే ఆయన వెంటనే సిట్‌కు లేఖ రాస్తూ స్పందించారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాను పూర్తిగా బిజీగా ఉన్నానని, అందువల్ల విచారణకు మరో తేదీ కేటాయించాలని కోరారు. కేసీఆర్ విజ్ఞప్తిని పరిశీలించిన సిట్ అధికారులు తొలుత సానుకూలంగా స్పందించారు. అయితే తాజాగా రెండో విడత నోటీసును జారీ చేస్తూ విచారణ తేదీని ఖరారు చేశారు. ఈ నోటీసులో కేసీఆర్ నివాసంలోనే విచారణ జరుగుతుందని స్పష్టత ఇచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్ తనను ఎర్రవల్లి ఫాంహౌస్‌లోనే విచారించాలని సిట్‌ను కోరినట్టు తెలిసింది. భద్రతా కారణాలు, సౌకర్యాల దృష్ట్యా ఎర్రవల్లి నివాసమే అనుకూలమని ఆయన వాదించారు. అయితే సిట్ అధికారులు ఈ అభ్యర్థనను సున్నితంగా తిరస్కరించారు. ఎర్రవల్లి వరకు కీలకమైన రికార్డులు, దస్త్రాలు తీసుకెళ్లడం సాధ్యం కాదని, విచారణకు అవసరమైన సాంకేతిక సదుపాయాలు నందినగర్ ప్రాంతంలోనే అందుబాటులో ఉంటాయని పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాదు, కేసీఆర్ అధికారిక చిరునామా నందినగర్‌గా నమోదై ఉండటమే విచారణను అక్కడే నిర్వహించడానికి ప్రధాన కారణమని వెల్లడించారు. కేసీఆర్ అభ్యర్థనపై సిట్ అధికారులు న్యాయ నిపుణుల సలహాను కూడా తీసుకున్నట్లు సమాచారం. చట్టపరంగా విచారణ ఎక్కడ జరపాలన్న అంశంపై సమగ్రంగా చర్చించి, అన్ని కోణాలను పరిశీలించిన తర్వాతే నందినగర్ నివాసంలోనే విచారణ చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం పూర్తిగా చట్టబద్ధంగానే తీసుకున్నామని సిట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. విచారణ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఉండేందుకు అన్ని నిబంధనలను పాటిస్తున్నామని పేర్కొన్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా ఫోన్లు ట్యాప్ చేశారన్న ఆరోపణలతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో పలువురు పోలీసు అధికారులు ఇప్పటికే విచారణను ఎదుర్కొంటున్నారు. కీలక దస్త్రాలు, సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా రికార్డుల ఆధారంగా సిట్ విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కూడా విచారించాల్సిన అవసరం ఉందని సిట్ భావిస్తోంది. సిట్ నోటీసులు జారీ కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చలు మరింత వేడెక్కాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఈ కేసులో చట్టప్రకారమే విచారణ జరుగుతోందని చెబుతుండగా, బీఆర్ఎస్ పార్టీ మాత్రం దీనిని రాజకీయ కక్ష సాధింపుగా అభివర్ణిస్తోంది. కేసీఆర్‌పై అక్రమంగా నోటీసులు జారీ చేసి రాజకీయ ఒత్తిడి తెచ్చే ప్రయత్నం జరుగుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం చట్టం ముందు అందరూ సమానమేనని, విచారణకు సహకరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనే ఉందని స్పష్టం చేస్తోంది.

# మేడారానికి పోటెత్తిన జనం

(మొదటి పేజీ తరువాయి)

నిండు జాతరలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పులుగా భక్తుల విశ్వాసం పొందిన వనదేవతలకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం ఈ జాతరలో ప్రధాన ఆకర్షణగా మారింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ అమ్మవార్లను దర్శించుకుని తన్మయత్వం చెందుతున్నారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం గద్దెల వద్ద అమ్మవార్లను దర్శించుకుని, మరో రెండేళ్ల తర్వాత మళ్లీ వస్తామని మొక్కుకుంటూ భక్తులు సంతోషంగా తిరుగు ప్రయాణమవుతున్నారు. మేడారం జాతరలో సామాన్య భక్తులతో పాటు ప్రముఖులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సతీ సమేతంగా వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రథమ పౌరుడికి పోలీసులు, ఇతర శాఖల అధికారులు ఘనస్వాగతం పలికారు. మంత్రి సీతక్క గవర్నర్ దంపతులకు వనదేవతల చరిత్ర, విశిష్టతను దగ్గరుండి వివరించారు. ఆదివాసీ సంప్రదాయాలు, సమ్మక్కసారలమ్మల వీరగాథలు గవర్నర్‌ను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం క్యూలైన్లలో ఉన్న భక్తులకు స్వయంగా పసుపు బొట్టు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులతో మమేకమై వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మేడారానికి వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు మంత్రి మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని వెల్లడించారు. ఆసియాలో అతిపెద్ద గిరిజన జాతరలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మేడారంలో స్వయంగా మొక్కులు చెల్లించుకున్న డీజీపీ, అక్కడ విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నప్పటికీ ఎలాంటి భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా, ప్రత్యేక పోలీస్ బృందాలతో జాతరను పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కూడా అమ్మవార్లను దర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పించారు.

# నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ సిఫార్సులు రావు

"నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిడులు గానీ, సిఫార్సులు గానీ ఉండవు. కష్టపడి పనిచేసే అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు... ప్రతి అధికారి నిబంధనలకు లోబడి మాత్రమే పని చేయాలి" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. పనిలో అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని ఏ మాత్రం సహించేది లేదని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైనా కఠినంగా వ్యవహరిస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కొంతమంది అధికారులు ఇంకా పాత నాయకులతో సంబంధాలు కొనసాగిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ పాలసీల అమలులో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ప్రజల సంతోషం, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు చిత్తశుద్ధితో, జవాబుదారీతనంతో వ్యవహరించాలని పవన్ కల్యాణ్ కోరారు. శుక్రవారం నాడు విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యు ఎస్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం, పల్లెపండగ 1.0, 2.0, జల్ జీవన్ మిషన్ వంటి పథకాల పురోగతిపై ఆరా తీశారు. లక్ష్యాలను ఎందుకు పూర్తి చేయలేకపోయారనే దానిపై అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో ఉంది. నాకు చప్పట్లు, పొగడ్తలు అవసరం లేదు. పని మాత్రమే కావాలి. ఉన్నత స్థాయి అధికారి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలి" అని అన్నారు. గత ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పంచాయతీల్లో స్వపరిపాలనకు చోటు లేకుండా చేసి, ఆర్థిక క్రమశిక్షణ లేకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను నీరుగార్చి, రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. పనులు చేసినట్టు రికార్డులు సృష్టించారు గానీ, ఒక్క ఇంటికి కూడా నీరు ఇచ్చిన దాఖలాలు లేవు" అని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ, వ్యవస్థలను బలోపేతం చేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖను ప్రభావవంతమైన శాఖగా తీర్చిదిద్దేందుకు సంస్కరణలు అమలు చేస్తున్నామని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న 10 వేల ప్రమోషన్లను ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా పూర్తి చేసి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని పవన్ గుర్తుచేశారు. ఉమ్మడి కడప జిల్లాలో ఓ ఎంపీడీవోపై దాడి జరిగితే స్వయంగా వెళ్లి భరోసా ఇచ్చామని, ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కష్టపడుతున్నామని, కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని, తమ కష్టానికి సార్థకత చేకూరేలా అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్, విశాఖపట్నం కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున, వివిధ శాఖల రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## త్రిశక్తి అమ్మవారికి 1008 సహస్ర కలశాలతో అభిషేకం

- అంగరంగ వైభవంగా శోభయాత్ర
- హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి



**వలిగొండ, జనవరి 30 (తొలివెలుగు):** వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ హరిహర త్రిశక్తి క్షేత్రంలో 12వ వార్షిక కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా రామాలయం నుంచి త్రిశక్తి దేవాలయం వరకు దేదీప్యమానంగా శోభయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి 1008 సహస్ర కలశాలతో అంగరంగ వైభవంగా అభిషేకం చేశారు. శోభయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, ఆర్యవైశ్యులు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాగారంలోని సాయి కృష్ణ ఎల్డర్ కేర్ హోం చైర్మన్ సాయి కృష్ణ తన సిబ్బందితో కలిసి భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించి, భోజన ఏర్పాట్లలో ఇబ్బందులు తలెత్తకుండా సహకరించారు. నిర్వాహకులు చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ శోభయాత్రకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో కమలాకర్ శర్మ, గోపాలకృష్ణ, అనురాధ, మనోహరి, శ్రీనివాసులు, దత్తాత్రేయ శర్మ, రాకేష్ శర్మ, లోకనాథ్ శర్మ, శ్రీపాద శర్మతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.




## సేవకురాలిగా ఉంటా.. ఆశీర్వదించండి!

- 3వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా పల్లె లావణ్య నామినేషన్ దాఖలు

**చౌటుప్పల్, జనవరి 30 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పల్లె లావణ్య సురేందర్ రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, ముఖ్య అనుచరులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కలసి నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ అనంతరం ఆమె మాట్లాడుతూ, 3వ వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవకురాలిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. వార్డులో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యలను ప్రాధాన్యంగా తీసుకొని పరిష్కార దిశగా పనిచేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని పేర్కొన్న పల్లె లావణ్య, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 'హస్తం' గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు. 3వ వార్డును అభివృద్ధి పథంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.



# ఘనంగా వర్కాల రాము గౌడ్ నామినేషన్

- జనసంద్రమైన 19వ వార్డు.. అభివృద్ధిపై అభ్యర్థి హామీ
- ధూంధాంగా రాము గౌడ్ నామినేషన్
- భారీ ర్యాలీతో తరలివచ్చిన శ్రేణులు.. నామినేషన్ దాఖలు
- వార్డులో వేడెక్కిన రాజకీయం





**చౌటుప్పల్, జనవరి 30 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎన్నికల పర్వం ఊపందుకుంది. శుక్రవారం 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా వర్కాల రాము గౌడ్ తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. పట్టణంలో ప్రధాన రహదారుల గుండా పార్టీ శ్రేణులతో కలిసి భారీ ప్రదర్శనగా వెళ్లిన ఆయన, రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేశారు. ఈ సందర్భంగా రాము గౌడ్ మాట్లాడుతూ.. వార్డు ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా తాను ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు ప్రకటించారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు మద్దతు తెలిపారు.



## గాంధీజీ మార్గం అనుసరణీయం

- ట్రినిటీ హైస్కూల్‌లో ఘనంగా బాపూజీ వర్ధంతి వేడుకలు
- గాంధీ గ్లోబల్ చైర్మన్ వెన్‌రెడ్డి సంధ్య రాజు
- పాఠశాల డైరెక్టర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల

**చౌటుప్పల్, జనవరి 30 (తొలివెలుగు):** చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్‌లో మహాత్మా గాంధీ వర్ధంతిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాంధీ గ్లోబల్ చైర్మన్ వెన్‌రెడ్డి సంధ్య రాజు మాట్లాడుతూ.. బాపూజీ అహింసా సిద్ధాంతం ప్రపంచానికే మార్గదర్శకమని కొనియాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ.. గాంధీజీ బోధనలు ప్రతి విద్యార్థి జీవితంలో వెలుగు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది నవ్య, శ్రీదేవి, సునీత, కొండమ్మ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో ముగిసిన నామినేషన్ల పర్వం

- మొత్తం 191 సెట్లు దాఖలు
- అత్యధికంగా కాంగ్రెస్ నుంచి 65

**చౌటుప్పల్, జనవరి 30 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎన్నికల తొలి ఘట్టం ముగిసింది. 20 వార్డులకు గాను మూడు రోజుల వ్యవధిలో మొత్తం 191 నామినేషన్లు దాఖలైనట్లు మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి తెలిపారు. చివరి రోజైన శుక్రవారం ఒక్కరోజే 67 మంది అభ్యర్థులు 126 నామినేషన్ సెట్లను సమర్పించారు. పార్టీల వారీగా చూస్తే.. కాంగ్రెస్ నుంచి 65, బీఆర్ఎస్ నుంచి 50, బీజేపీ నుంచి 41 నామినేషన్లు వచ్చాయి. అలాగే సీపీఎం నుంచి 10, ఇతర పార్టీల నుంచి 11, స్వతంత్రులుగా 14 మంది బరిలో నిలిచారు. నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామ్ రెడ్డి వెల్లడించారు.






## చౌటుప్పల్‌లో 'సీఎం కప్' క్రీడా సంబరం

- పోటీలను ప్రారంభించిన ఎంఈఓ గురువారావు
- క్రీడాకారుల ఉత్సాహభరిత ప్రదర్శన

**చౌటుప్పల్, జనవరి 30 (తొలివెలుగు):** చౌటుప్పల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో 'సీఎం కప్2026' మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యాధికారి ఇ. గురువారావు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గురువారావు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులు తమ ప్రతిభను చాటి మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మొదటి రోజు నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహభరిత ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పురుషుల కబడ్డీ పోటీల్లో చిన్నకొండూరు జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, మున్సిపాలిటీ విభాగంలో చౌటుప్పల్ జట్టు విజేతగా నిలిచింది. ఖో-ఖో పురుషులు, మహిళల విభాగాల్లో పంతంగి జట్లు విజయం సాధించాయి. వాలీబాల్ పురుషులు, మహిళల పోటీల్లో పీపల్ పహాడ్ జట్లు విజేతలుగా నిలిచాయి. అలాగే చౌటుప్పల్ క్లస్టర్ జట్లు పలు విభాగాల్లో పైచేయి సాధించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ్, తంగడపల్లి ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



## 18వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా గోగులోతు అరుణ శంకర్ నాయక్





- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో ఎన్నికల బరిలోకి

**చౌటుప్పల్, జనవరి 30 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గోగులోతు అరుణ శంకర్ నాయక్ మున్సిపల్ ఎన్నికల బరిలోకి అడుగుపెట్టారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో ఆమెకు పార్టీ టికెట్ లభించింది. ప్రజా జీవితంలోకి ఇదే ఆమె తొలి అడుగు కాగా, తొలిసారిగా ప్రజల ముందుకు వచ్చి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. సమాజ సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టినట్లు గోగులోతు అరుణ శంకర్ నాయక్ తెలిపారు. 18వ వార్డులో నెలకొన్న మౌలిక సమస్యలు, అభివృద్ధి అవసరాలను గుర్తించి ప్రజల భాగస్వామ్యంతో పరిష్కార దిశగా పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం వంటి కీలక అంశాలకు ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 18వ వార్డు ప్రజలు తనను ఆదరించి ఆశీర్వదిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.."నన్ను తొలిసారి పరీక్షించే అవకాశం ప్రజలకు వచ్చింది. నిజాయితీగా, పారదర్శకంగా పనిచేసే అవకాశం ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి ఆశీర్వదించాలని కోరుతున్నాను" అన్నారు.

# జీవామృతంతో భూమిలో సారం పెరుగుతుంది : ఏవో పద్మజ

**మునుగోడులో వరి పొలాల సందర్శన**

**మునుగోడు, (తొలివెలుగు):** జీవన పద్ధతులతో తెగుళ్ల పురుగులు నివారించవచ్చు అని మండల వ్యవసాయాధికారి పద్మజ అన్నారు.. మునుగోడు గ్రామ పంచాయతీలోని రామకృష్ణాపురంలో బీసం నాగమ్మ మరియు ఈద వెంకన్నల వరి పొలాల ను సందర్శించి,వరిలో వేరు కుళ్ళు మరియు కాండం కుళ్ళు తెగుళ్లను గమనించడం జరిగిందనీ తెలిపారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా వంటి నత్రజని ఎరువులను అధికంగా వాడడం వలన పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరుగుతుందనీ,కలుపు మందులు కూడా మోతాదుకు మించి వాడడం వలన పంటలకు నష్టం కలుగుతుందనీ తెలిపారు.అధికంగా మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు, కలుపు మందులు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి . తెగుళ్ళ నివారణ కోసం ముందుగా పొలంలోని నీటిని తీసివేసి పగుళ్లు వచ్చే వరకు ఆరబెట్టుకుని మరల నీరు పెట్టుకోవాలి.పొలాలలో ఎక్కువ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉండడం వల్ల వేర్లకు ఆక్సిజన్ అందకపోవడం వల్ల వేరులు కుళ్ళిపోతుంటాయి.నీరు తీసేసి పగుళ్లు వచ్చే వరకు ఆరబెట్టి మరల నీళ్లు పెట్టుకోవడం వల్ల మొక్కల వేర్లకి ఆక్సిజన్ బాగా అందుతుందనీ,ఇలా చేయడం వలన వరి పొలాలు చలిని కూడా తట్టుకోగలుగుతాయి.ఈ శిలీంద్రాల నివారణ కోసం అజాక్సిస్ట్రోబిన్ మరియు డైఫేనోకొనజోల్ కాంబినేషన్ మందు లేదా సాఫ్ లేదా ప్రొఫికొనజోల్ లేదా టేబ్యుకొనజోల్ లేదా ట్రయాడి మెఫాన్ లేదా మాశీకో జెబ్ లేదా కార్బండ జిమ్ వంటి శిలీంద్ర నాశనులను ఉపయోగించి నివారించుకోవచ్చు అన్నారు.ఆవు పేడ 10 కిలోలు, ఆవు మూత్రము 10 లీటర్ల, శెనగపిండి 2 కిలోలు, బెల్లం 2 కిలోలు, పుట్టమన్ను పిడికెడు తీసుకొని వాటిని 200 లీటర్ల డ్రమ్ములో వేసి డ్రమ్మును నీటితో నింపి రోజు కలియబెడుతూ ఉంటే జీవామృతం ఒక వారం రోజులకు తయారవుతుంది.ఈ జీవామృతం తయారు చేసుకొని ఉపయోగించడం వలన భూమిలో సారం పెరగడమే కాకుండా మొక్కకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. వరిలో కాలిబాటలు రెండు మీటర్లకు ఒక అడుగు చొప్పున తీసుకోవడం వలన మొక్కలకు గాలి వెలుతురు సరిగా అంది చీడపీడల ఉధృతి తగ్గుతుందనీ వివరించారు.. ఈ కార్యక్రమంలో చెనగోని రవీందర్, రాణి, శ్రీను రైతులు పాల్గొన్నారు.

# 19వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిగా పిల్లలమర్రి మధుసూదన్ నామినేషన్

**ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధి చేసి చూపిస్తా : మధుసూదన్**




**చౌటుప్పల్, జనవరి 30 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పిల్లలమర్రి మధుసూదన్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీర్వాదంతో ఆయన నామినేషన్ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా పిల్లలమర్రి మధుసూదన్ మాట్లాడుతూ.. 19వ వార్డులో ఉన్న ప్రధాన సమస్యలను ప్రజలు తనకు అవకాశం ఇస్తే, గెలిచిన మూడు నెలల లోపే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అధికార పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని పేర్కొన్న ఆయన, 19వ వార్డు ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాను నాయకుడిగా కాకుండా ప్రజల సేవకుడిగా మీ ముందుకు వస్తున్నానని, ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని మధుసూదన్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి కృషి:

- 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం
- సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్

**చౌటుప్పల్, జనవరి 30 (తొలివెలుగు):** గ్రామాల్లో దీర్ఘకాలంగా వేధిస్తున్న లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని కొన్ని ఇళ్లలో లో వోల్టేజ్ కారణంగా ఫ్యాన్లు కూడా తిరగడం లేదని గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ సమస్యను వెంటనే ఏఈ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేపట్టిన 'పల్లెబాట' కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని సందర్శించినప్పుడు ఈ సమస్యను వివరించగా, ఆయన ఆదేశాల మేరకు తక్షణమే నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పాటు, రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి, రోడ్డు అంచున నూతన సిమెంటు స్తంభాలను నాటడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధి పనుల పట్ల స్థానికులు సర్పంచ్‌కు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనూప్ రెడ్డి, శ్రీ ఆదిమహావిష్ణువు దేవాలయ కమిటీ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి, పన్నాల రాజిరెడ్డి, బొమ్మ మైసయ్య, లైన్ మెన్ సూర్యనారాయణ, అసిస్టెంట్ లైన్ మెన్ కిషోర్ కుమార్, వార్డు సభ్యులు ఊదరి రమేష్, దోనూరి కిరణ్, బొమ్మ అమరావతి, పాక రాము, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ఖమ్మం పర్యాటక భవిష్యత్తుకు దిశానిర్దేశం

- ఖిల్లా రోప్‌వే పనులపై మంత్రి తుమ్మల ఫోకస్ ఖమ్మం ఖిల్లా రోప్ వే పనులు పురోగతిపై మంత్రి తుమ్మల సమీక్ష
- మంత్రి తుమ్మల తో భేటీ అయిన రోప్ వే సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీ.ఈ.ఓ రంజిత్ పక్రాసీ
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు గారు, కమీషనర్ వల్లూరి క్రాంతి మరియు మున్సిపల్ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య గారితో ఫోన్ లో మాట్లాడిన మంత్రి తుమ్మల
- రోప్ వే నిర్మాణం కోసం నిధులు విడుదల చేసి పనులు వేగవంతం అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరిన మంత్రి తుమ్మల
- ఖమ్మం పర్యాటక రంగంలో మకుటంలా ఖిల్లా రోప్ వే నిర్మాణం....మంత్రి తుమ్మల

**(తొలివెలుగు):** ఖమ్మం పర్యాటక రంగాన్ని కొత్త మలుపు తిప్పే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా భావిస్తున్న చారిత్రక ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరానికి పర్యాటక కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలో కీలక భేటీ శుక్రవారం హైదరాబాద్‌లో రోప్‌వే నిర్మాణ బాధ్యతలు చేపట్టిన రోప్‌వే సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈఓ రంజిత్ పక్రాసీ మంత్రి తుమ్మలతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తైన దశలు, భవిష్యత్తు కార్యాచరణపై విస్తృతంగా చర్చ జరిగింది. పనుల స్థితిగతులపై సమీక్ష రోప్‌వే నిర్మాణ పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో సీఈఓ రంజిత్ పక్రాసీ మంత్రి తుమ్మలకు సవివరంగా వివరించారు. భూసేకరణ, సాంకేతిక అంశాలు, నిర్మాణ పనుల షెడ్యూల్‌పై సమగ్ర నివేదిక సమర్పించారు. పనులు మరింత వేగంగా సాగేందుకు అవసరమైన అంశాలను మంత్రి తుమ్మల అడిగి తెలుసుకున్నారు. పర్యాటక శాఖ మంత్రి మరియు అధికారులతో ఫోన్‌లో సమీక్ష ఈ సందర్భంగా మంత్రి తుమ్మల పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు టూరిజం కమిషనర్ వల్లూరి క్రాంతితో ఫోన్‌లో మాట్లాడారు. ఖిల్లా రోప్‌వే నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసి, పనులు ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.



**ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌కు స్పష్టమైన ఆదేశాలు**

ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనులు పునాది స్థాయిలో వేగవంతం అయ్యేలా చూడాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ కు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. రోప్‌వే కంపెనీ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ చిన్నచిన్న సమస్యలు కూడా వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎక్కడా పనులు ఆగకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఖమ్మం పర్యాటకానికి కీలక ప్రాజెక్టు చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఖమ్మం ఖిల్లా ప్రాంతానికి రోప్‌వే నిర్మాణం పూర్తయితే పర్యాటక రంగంలో కొత్త అధ్యాయం మొదలవుతుందని మంత్రి తుమ్మల అభిప్రాయపడ్డారు. రోప్‌వే ద్వారా ఖిల్లా ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, దీంతో ఖమ్మం నగర ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుందని తెలిపారు.

**ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం**

ఖమ్మం పర్యాటక రంగంలో మకుటంలా నిలిచే ఈ రోప్‌వే నిర్మాణానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలను ప్రభుత్వ పరంగా అందిస్తామని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. రోప్‌వే కంపెనీ సీఈఓ రంజిత్ పక్రాసీకి పూర్తి భరోసా కల్పిస్తూ, పనులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా ప్రభుత్వ యంత్రాంగం అంతా కలిసి పనిచేస్తుందని తెలిపారు. ఉపాధి అవకాశాలు స్థానిక అభివృద్ధి ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు పూర్తయితే పర్యాటకుల సంఖ్య పెరగడమే కాకుండా, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. హోటళ్లు, రవాణా, గైడ్ సేవలు తదితర రంగాలకు డిమాండ్ పెరిగే అవకాశముందని చెబుతున్నారు. ఖమ్మం నగరాన్ని పర్యాటక పటంలో ప్రత్యేకంగా నిలబెట్టే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు భవిష్యత్తులో జిల్లాకు కీలక ఆర్థిక వనరుగా మారుతుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగటానికి ఇప్పటి నుంచే కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లా కలెక్టరేట్లో సోహన్ అకాడమీ మరియు విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన "మీట్ ద కలెక్టర్" కార్యక్రమంలో మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా వారి చుట్టూ ఉండే అనేక రకాల సమస్యలకు సాంకేతికత ఆధారంగా పరిష్కారాలు కనుగొనాలని, ఆ పరిష్కారాలు ఆచరణ యోగ్యంగా ఉండి ఎవరైనా స్వల్ప పెట్టుబడితో తయారు చేసుకునే విధంగా ఉండాలని సూచించారు. ఇలా తయారు చేసే క్రమంలోనే శాస్త్రవేత్తలు ఆవిర్భవిస్తారని, వారే దేశ ప్రజల ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపగలుగుతారని పిల్లలకు ఉద్బోధించారు. పిల్లలు తయారు చేసిన వివిధ రకాల రోబోటిక్ ఎగ్జిబిట్లను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. రైతులు పంటలు పండించడానికి ఎదుర్కొనే సమస్యలు, ఇళ్లలో కోతుల సమస్యలు, దొంగల నుండి ఇంటిని రక్షించుకోవడానికే అవసరమైన వ్యవస్థలు, ఇటువంటి నిత్యజీవిత సమస్యలకు ఆచరణ యోగ్యమైన పరిష్కారాలు కనుగొనాలని పిల్లలకు తెలిపారు. సోహన్ అకాడమీ వారు జిల్లాలోని గుర్తించిన 13 పీఎం శ్రీ పాఠశాలల్లో వర్క్ షాప్‌లు నిర్వహించి పిల్లలకు రోబోటిక్స్ పై అవగాహన కల్పించడం నిజంగా అభినందనీయమని అన్నారు. సోహన్ అకాడమీ డైరెక్టర్ సహదేవ్ మాట్లాడుతూ ఇప్పటివరకు 32 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశామని, కానీ భద్రాద్రి జిల్లాలో లభించిన ఆదరణ ఏ జిల్లాలోనూ లభించలేదని దీనికి కారణమైన కలెక్టర్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్ పథకంలో భాగంగా పీఎం శ్రీ పాఠశాలలకు అందించిన పరికరాలను ఎలా వినియోగించాలో ఉపాధ్యాయులకు విద్యార్థులకు కూడా అవగాహన కల్పించిన సోహన్ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ప్రతిభ కనపరచిన పాఠశాలలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి




ఏనాగరాజ శేఖర్, సమ్మేళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్కే సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, సోహన్ అకాడమీ ఫౌండర్ డైరెక్టర్ సహదేవ్, మరియు వారి బృందం తో పాటు ఎన్నిక చేసిన 13 పీఎం శ్రీ పాఠశాల నుండి విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సేవకురాలిగా వస్తున్నా.. ఆశీర్వదించండి

**- పారదర్శక పాలనే మా లక్ష్యం: మసనం సంగీత శ్రీను**

చౌటుప్పల్, జనవరి 30 (తొలివెలుగు): చౌటుప్పల్ మున్సిపాలిటీ 10వ వార్డు భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా మసనం సంగీత శ్రీను శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వార్డులో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తానని భరోసా ఇచ్చారు. పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారుల వంటి సమస్యలను పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. పారదర్శక పాలన అందించడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. 'మసనం లక్ష్మయ్య ఫౌండేషన్' ద్వారా తాము చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి, కౌన్సిలర్‌గా అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు.






# యాదాద్రిలో చిన్న మేడారం జాతర సంబరాలు

**మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చిన యాదాద్రి భువనగిరి జిల్లా కుమ్మర సంఘం నాయకులు.**

**(తొలివెలుగు):** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కుర్రారం గ్రామంలో సమ్మక్క సారలమ్మల జాతర సందర్భంగా మండలంలో చిన్న మేడారం చల్లూరి శివారులోని యాదాద్రి మేడారం లక్ష్మక్క పల్లి గ్రామంలో గురువారం సాయంత్రం సమ్మక్క గద్దెపై చేరారు. బూరుగుపల్లి శివారులోని పులిగుట్ట నుంచి ప్రత్యేక పూజలు అనంతరం డబ్బు చప్పులతో శివసత్తుల పూనకాలు భక్తుల నినాదాలతో ప్రదర్శనగా తీసుకొచ్చారు. ఆలయం ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలసందడి కనిపించింది. మొక్కులు చెల్లించి నిలువెత్తు బంగారం సమర్పించారు. కుర్రారం గ్రామ నాయకులు తరిగొప్పుల నరసింహ,భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన సమ్మక్క సారమ్మల పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా యాదాద్రి భువనగిరి జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షులు ఓరుగంటి గోపాల్, ప్రధాన కార్యదర్శి దరిపల్లి ప్రవీణ్ కుమార్ తోపాటు జిల్లా ఉపాధ్యక్షులు దొమ్మాట మహేష్, జిల్లా సహాయ కార్యదర్శి నాగపురి పుల్లయ్య, రాజపేట మండల కన్వీనర్ బోనాల వెంకటేష్ కో-కన్వీనర్ కట్కూరి వెంకటేష్, తవిటి కృష్ణమూర్తి, ఇంద్రపాల ఆంజనేయులు, దొమ్మాట వేణుగోపాల్, చలమలపల్లి లక్ష్మణ్, కందుకూరి రామచందర్ లు జిల్లా కుమ్మరి సంఘం నాయకుడు అందరూ హాజరై అమ్మవారి కృపకు పాత్రుడైనారు.